కర్నూలు । నంద్యాల
వార్త
18 ఆగస్టు, 2024 ఆదివారం పేజీలు 4

# 100 రోజుల ప్రణాళికలో పొందుపరిచిన లక్ష్యాలను సాధించాలి

**- రెవిన్యూసదస్సులను సీరియస్‌గా తీసుకోవాలి**
**- జిల్లా కలెక్టరు పి రంజిత్ బాషా**



**కర్నూలు, ఆగస్టు 17, ప్రభాతవార్త:** 100 రోజుల ప్రణాళికలో పొందుపరిచిన లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టరు పి రంజిత్ బాషా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో రెవిన్యూసదస్సులు, హౌసింగ్, ఉపాధి హామి తదితర అంశాలపై తహశీల్దార్‌లు, ఎంపీడిఓలతో జిల్లా కలెక్టరు సమీక్ష నిర్వహించారు. ఈసందర్బంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అదేశాల మేరకు వంద రోజులు, ఏడాది, ఐదేళ్ల లక్ష్యాలను ఏర్పరచుకొని జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముందుగా వంద రోజుల ప్రణాళికలో కేటాయించిన లక్ష్యాలను సాధించే దిశగా మండల, జిల్లాస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టరు అదేశించారు. రెవిన్యూ సదస్సులను అధికారులు సీరియస్‌గా తీసుకోవాలన్నారు. రెవిన్యూ సదస్సులకు సంబంధించిన ప్రభుత్వం త్వరలో తేదిలను ప్రకటిస్తుందన్నారు. మండల స్థాయిలో సమస్యలను పరిష్కరించకపోవడం వల్ల ప్రతి సోమవారం ప్రజలు సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి ఎక్కువగా వస్తున్నారన్నారు. సమస్యను అర్థం చేసుకుంటే పరిష్కారం సులువు అవుతుందని అందువల్ల రెవిన్యూ సదస్సులకు ముందు ఆర్ఓఆర్ యాక్టు నియమ నిబంధనలు పూర్తిస్థాయిలో చదవాలన్నారు. ఆగస్టు 20వ తేది నుండి స్పెషల్ సమ్మరీ రివిజన్-2025 ప్రక్రియ ప్రారంభించాలని కలెక్టరు ఈఆర్ఓ, ఎఈఆర్ఓలను అదేశించారు. ఇందులోభాగంగా బిఎల్ఓలతో ఇంటింటి పరిశీలన చేయించాలన్నారు. అక్టోబరు 2వ తేది నాటికి రాష్ట్రమంతటా జిల్లాలో ప్రతి గ్రామ పంచాయితీలో చెత్త సంపద తయారీ కేంద్రాలు తప్పనిసరిగా నిర్వహణలోకి రావాలని కలెక్టరు పేర్కొన్నారు. ఉపాధి హామి పనులకు సంబంధించి జాబ్ కార్డులు ఉన్నవారికి పనులు కల్పించడంలో ఇతర జిల్లాలు 70 శాతం, 60 శాతం చేస్తుంటే కర్నూలు జిల్లా కేవలం 50 శాతం సాధించడం జరిగిందని కలెక్టరు అసంతృప్తి వ్యక్తం చేశారు. జాయింట్ కలెక్టరు నవ్య మాట్లాడుతూ ఈక్రాప్ బుకింగ్‌కు సంబంధించి సెప్టెంబరు 15వ తేది నాటికి పూర్తి చేయాలన్నారు. విఏఏ, ఎంఏఓతో పాటు విఆర్‌ఏలు త్వరితగతిన ఈక్రాప్ బుకింగ్ పూర్తి అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో ఆధోని కలెక్టరు శివ నారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టరు చల్లా కళ్యాణి, ఆర్డీఓలు, జిల్లా అధికారులు, ఎంపీడిఓలు, తహాశీల్దార్‌లు, హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పొంగిన వేదావతి

**- ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు స్తంభించిన రాకపోకలు....**
**- ప్రమాదమని తెలిసినా తప్పని పుట్టి ప్రయాణం**





**హాలహర్వి, ఆగస్టు17, ప్రభాతవార్త;** గత రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని గూళ్యం గ్రామ సమీపంలో ఉండే వేదావతి నదికి భారీగా వరదనీరు వచ్చాయి. దీంతో వేదావతి నది ఉప్పొంగింది. ఆంధ్ర, కర్నాటక రాష్ట్రాల మధ్య రాకపోకలు స్తంభించాయి. గత రెండు రోజులుగా మండలంలోని భారీ వర్షాలు కురవడంతో వేదావతి నదికి భారీగా వరదనీరు చేరాయి. కర్ణాటక సరిహద్దులో ఉండే గూళ్యం నుంచి కర్ణాటక గ్రామాలైన బసరకోడు, అడ్లిగి, శిరుగుప్ప, మోకా, బళ్లారి తదితర ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోవడంతో రెండు రాష్ట్రాల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరు రాష్ట్రాల ప్రజలు కలిసి వేదావతి నదికి తాత్కాలిక వంతెనను ఏర్పాటు చేసుకున్నారు. అయితే వేదావతి నదికి భారీ వరదనీరు రావడంతో తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. దీంతో ప్రమాదమని తెలిసినా ప్రయాణికులు పుట్టి ప్రయాణం చేస్తున్నారు. ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు స్పందించి వేదావతి నదిపై వంతెన నిర్మించాలని రెండు రాష్ట్రాల ప్రజలు కోరుతున్నారు.

# నేటినుండి శ్రీ రాఘవేంద్రస్వామి 353వ.. సప్త రాత్రోత్సవాలు

- ధ్వజారోహనంతో ఉత్సవాలకు అంకురార్పణ
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- 20న పూర్వారాధన,21 మధ్యారాధన,22న మహా రథోత్సవం
- పోలీసుల ఆధ్వర్యంలో భారీబందోబస్తు ఏర్పాటు









**మంత్రాలయం,ఆగస్టు 17,ప్రభాతవార్త:** దక్షిణ భారతదేశంలో రెండవ తిరుపతిగా పేరుగాంచిన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి 353వ సప్త రాత్రోత్సవాలు శ్రీమఠంలో నేటినుండి ప్రారంభం కానున్నాయి.శ్రీమఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ధ్వజారోహనంతో ఈ ఉత్సవాలను ప్రారంభిస్తారు. ఈ ఉత్సవాలలో భాగంగా ధ్వజారోహనంతో పాటు గోపూజ, అశ్వపూజ, ధాన్య పూజ, లక్ష్మిపూజ,శ్రీమఠం పరిపాలనా భవనాల పూజలు తదితర పూజలతో పీఠాధిపతి ఈ ఉత్సవాలకు అంకురార్పణ చేస్తారు.ఈ ఉత్సవాలు మొదటి రోజులో భాగంగా స్వామివారికి వేకువ జామునుండే సుప్రభాతసేవ, నిర్మలవిసర్జనసేవ, రాయర పాదపూజ. అష్టోదకం, కనకాభిషేకం, పంచామృతాభిషేకం,పల్లకిసేవ,ఊంజల్‌సేవ,మూలరాముల పూజలు చేస్తారు. అదేవిధంగా ప్రార్థనోత్సవం, ప్రభోత్సవం, ధాన్యోత్సవం తదితర పూజలు నిర్వహిస్తారు.ఈ ఉత్సవాలలో భాగంగా 20వ తారీఖున పూర్వారాధన,21న మధ్యారాధన,22న ఉత్తరారాధనలో భాగంగా శ్రీ రాఘవేంద్రస్వామి వారి మహా రథోత్సవం నిర్వహిస్తారు.ఈ ఉత్సవాలకు శ్రీమఠం అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. తాగునీరు, శౌచాలయాలు, పార్కింగ్ సౌకర్యం, రవాణా సౌకర్యం, వసతి గృహాలు,సిసి కెమెరాలు, వైద్య సదుపాయం, అంబులెన్స్ సర్వీసులు, పరిమళ ప్రసాదం,ఉచిత అన్నదానం తదితర వసతులను ఉచితంగా భక్తులకు కల్పిస్తున్నారు. ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్‌లు ఎస్‌కె శ్రీనివాసరావు, వెంకటేష్‌జోషి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచారిల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను సిద్దంచేశారు.తుంగభద్రనది ప్రమాదకరంగా ప్రవహిస్తుండడంతో నదివద్ద గజ ఈతగాళ్ళను ఉంచారు.ఉత్సవాలకు భారీ బందోబస్తు ఏర్పాట్లు:సిఐ పుల్లెం రామాంజులుశ్రీ రాఘవేంద్ర స్వామి 353వ ఆరాధనోత్సవాలకు సుమారు 353మంది పోలీస్ సిబ్బందిలో భారీబందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రాలయం సిఐ పుల్లెం రామాంజులు అన్నారు. ఇందులో నలుగురు డిఎస్‌పిలు,20మంది సిఐలు ఎస్ఐలు,మహిళా పోలీసులు,హోంగార్డుల ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు.ఈ ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు చేపడతామన్నారు.

# స్కూల్ బస్సు దిచక్రవాహనం.. ఢీ

**- వ్యక్తి మృతి**



**గోనెగండ్ల ఆగస్టు 17 ప్రభాతవార్త :** గోనెగండ్ల మండల పరిధిలోని గంజహళ్ళి,గోనెగండ్ల గ్రామాల మధ్య జీనియస్ గ్లోబల్ స్కూల్ విద్యార్థి బస్సు దిచక్రవాహన ఢీ కొనడంతో వాహనంపై ఉన్న గంజహళ్ళి దరగయ్య (35) అనే వ్యక్తి మృతి చెందాడు.సంఘటనకు సంబంధించి పోలీసులు బంధువులు అందించిన సమాచారం మేరకు గంజహళ్లి గ్రామానికి చెందిన దరగయ్య కు భార్య,ఇద్దరు కుమారులు,ఒక కూతురు ఉంది.కూలీ పనులు చేసి జీవనం సాగించేవారు.అయితే ఆదివారం దరగయ్య మేనల్లుడైన దరగన్న పెళ్లి కావడంతో పెళ్లికి కావాలసిన సరుకులు తీసుకువచ్చేందుకు శనివారం తన దిచక్రవాహనం (ఏపీ 39 జీవీ 55820 పై గోనెగండ్లకు బయలు దేరాడు.అయితే గోనెగండ్ల సమీపంలోని ఎల్లెల్సీ కాలువ దగ్గర ఉన్న మలుపు దగ్గరకు రాగానే గోనెగండ్లకు చెందిన జీనియస్ గ్లోబల్ స్కూల్‌కు చెందిన విద్యార్థుల బస్సు (ఏపీ 15టీబీ 6619) గంజహళ్లి వైపు వెలుతుంది.అయితే బస్సు అతివేగంగా అజాగ్రత్తతో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనంను ఢీ కొట్టింది.దీంతో వాహనంపై ఉన్న దరగయ్యను ఢీ కొంది దీంతో దరగయ్య రోడ్డుపై ఎగిరి పడటంతో తలకు తీవ్రమైన గాయాలు అయ్యాయి.రక్తస్రావం ఎక్కువ గా కావడంతో దరగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు.అజాగ్రత్తగా బస్సును నడిపిన వ్యక్తి మృతి కి కారణం అయిన బస్సు డ్రైవర్ కందనాతి షేక్ మాబువలి అక్కడి నుంచి పారిపోయాడు.విషయం తెలుసుకున్న దరగయ్య కుటుంబసభ్యులు,పెళ్లికి వచ్చిన బంధువులు రోధనలతో సంఘటనాస్థలం శోకసంద్రంగా మారిపోయింది.మృతుని భార్య బాలక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

## ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తి మృతి



**దేవనకొండ,ఆగస్టు 17,ప్రభాతవార్త :** ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని బేతపల్లి గ్రామ శివారున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఇలా వున్నాయి. కోడుమూరు మండలం కల్లపరి గ్రామానికి చెందిన బోయ మల్లికార్జున(36)అనే వ్యక్తి ప్రమాదవశాత్తు తన యొక్క ట్రాక్టర్‌ను అదుపు చేసుకోలేక ట్రాక్టర్ పల్టీ పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## రోడ్డు ప్రమాదంలో.. యువకుడు మృతి

**ఆదోని రూరల్,ఆగస్టు 17,ప్రభాతవార్త**

రోడ్డు ప్రమాదంలో వెంకటేష్ అనే యువకుడు మృతిచెందిన సంఘటన పట్టణ సమీపాన రాజనగర్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఇలా వున్నాయి. మండల పరిధిలోని బైచిగేరి గ్రామానికి చెందిన వెంకటేష్ అనే యువకుడు తన సొంత పనినిమిత్తం బైచిగేరి నుండి ఆదోనికి బైక్‌పై వెళుతుండగా ఎమ్మిగనూరు నుండి వస్తున్న లారీ అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొనడంతో వెంకటేష్(27)అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య,ఒక కుమారుడు,ఒక కూతురు వున్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



# శిశ్వకర్మ యోజన పథకం కింద చేతివృత్తుల పనివార్తను ప్రోత్సాహించాలి

**- అర్హులైన చేతి వృత్తుదారులకు రుణ సౌకర్యం కల్పించండి : జిల్లా కలెక్టర్**



**నంద్యాల,ఆగష్టు 17,ప్రభాతవార్త:** ప్రధాన మంత్రి విశ్వకర్మ చోజన పథకం కింద గుర్తించిన చేతి వృత్తుల పనివార్లనుప్రోత్సాహిస్తూ రుణ సౌకర్యం కూడా కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు.శనివారం విశ్వకర్మ యోజన పథకం అమలుకు సంభంధించి జిల్లాస్థాయి కమిటీ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతు విశ్వకర్మమ యోజన పథకం కింద 18 రకాల చేతి వృత్తుదారులు అర్హులు అవతారని ఇందుకు సంభంధించి జిల్లాలో స్వీకరించిన 51,920 దరఖాస్తులను మరోకసారి సమగ్రంగా పరిశీలించి నివేదికలు ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో సంభంధిత చేతివృత్తుల పనివాళ్ళు వంశపారంపర్యంగా చేస్తున్నారా, నిజమైన చేతివృత్తుల దారులు కాదా అని పరిక్షించాలన్నారు. నిజమైన చేతివృత్తుల పనివారులు అయితే గ్రామీణ ప్రాంతాలలో గ్రామ సర్పంచ్ ద్వారా పట్టణ ప్రాంతాలలో మున్సిపల్ కమీషనర్ ద్వారా సంభంధిత లాగిన్లలో సిఫారస్ చేస్తున్నట్లు ధృవీకరించాలన్నారు. స్వీకరించిన 51.920 దరఖాస్తులలో పరిశీలించగా 40,009 అర్హత ఉన్నాయని, 11,764 దరఖాస్తులు పెండింగ్‌లో ఉంగా 147 దరఖాస్తులను తిరస్కరించామని పరిశ్రమల జిల్లా మేనేజర్ కలెక్టర్‌కు నివేదించారు. గుర్తించిన వారిలో వండ్రంగి, పడవల తయారి, కమ్మరవాడు కమ్మర కవచ తయారి సాధనన పనిముట్లు, తాళకాల తయారి దారులు శిల్పి, వెండడి, బంగారం మొదలైన లోహాలతో ఆభరాణాలు చేయు స్వర్ణ శిల్సి, కుమ్మరి, చెప్పులు కుట్టువాడు, తాపి మేస్త్రీ, బుట్టతయారి, బొమ్మతయారి, పూలమాలలు అల్లేవారు, డాబా దర్జీలు, చేపల వల తయారి తదితర చేతి వృత్తాల వారిని గుర్తించామని కలెక్టర్‌కు వివరించారు. గుర్తించిన చేతి వృత్తాలవారులను సమగ్రంగా పునపరిశీలించి నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశాంచారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల జిల్లా మేనేజర్ శ్రీనివాసయాదవ్, పంచాయితీ అధికారి మంజుల వాణీ, లీడ్ జిల్లా మేనేజర్ రవీంద్రాకుమార్, స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, మున్సిపల్ కమీషనర్ నిరంజన్‌రెడ్డి, డి.ఎల్.డి.ఓ. కళ్యాణి, కేంద్ర ప్రభుత్వ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నేను లోకల్ ఎమ్మెల్యేనూ.. మీలో ఒక్కడినై పనిచేస్తా : ఎమ్మెల్యే

**: కెసి కాలువకు పుష్కలంగా నీరు**
**: నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకాలతో రైతులను అదుకుంటాం**






**నందికొట్కూరుటౌన్, ఆగస్టు 17, ప్రభాతవార్త :** నేను లోకల్ ఎమ్మెల్యేనూ.. మీలో ఒక్కడినై పనిచేస్తా, మీ సమస్యలు పరిష్కరిస్తా, గతంలో ఇక్కడ నాన్‌లోకల్ వాళ్లను గెలిపిస్తే వారు కేవలం తమ పేర్ల చివర, తమ కార్లకు ఎమ్మెల్యే అనే స్టిక్కర్ తగిలించుకున్నారు, వెల్లిపోయారు, మొదటిసారి నందికొట్కూరు నియోజకవర్గ ప్రజలు లోకల్ వ్యక్తి అయిన తనను ఎమ్మెల్యేగా గెలిపించారు, వారి మధ్యలోనే ఉంటూ నిరంతరం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, తన రాజకీయ గురువు అయిన మాండ్ర శివానందరెడ్డి సూచనలతో నందికొట్కూరు నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. పట్టణంలోని అత్మ భవనంలో శనివారం ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల వ్యాపారులు, డీలర్లతో వ్యవసాయశాఖ ఏఓ షేక్షావలి అధ్యక్షతన ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మాట్లాడుతూ ..నందికొట్కూరు నియోజకవర్గానికి కళ్లెదురుగా సాగునీరు ఉన్నా రైతు కళ్లలో కన్నీళ్లే కనబడుతున్నాయని, భవిష్యత్‌లో నియోజకవర్గంలోని పలు మండలాలకు ఎత్తిపోతల పథకం కింద తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పొలాలకు సాగునీరు అందించేందుకు తీవ్ర కృషి చేయనున్నట్లు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. నందికొట్కూరు నియోజకవర్గం నుంచి కృష్ణానది నీటిని తాగునీరు, సాగునీటి కోసం సుదూర ప్రాంతాలకు తరలించుకెళ్తున్నారు, కానీ ఇక్కడ నియోజకవర్గంలోని వేలాది ఎకరాలకు ఇప్పటికీ సాగునీరు అందించలేని పరిస్థితి ఉందన్నారు. ముఖ్యంగా మిడుతూరు మండలంలో 90శాతం పొలం అంతా వర్షాధారంపైనే అధారపడి ఉందని, అతి త్వరలో ఈ మండలానికి ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించే ప్రణాళిక తయారు చేస్తున్నామన్నారు. అంతేకాకుండా ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం ద్వారా ఎక్కడికెక్కడికో నీరు తరలించుకెళ్తున్నారని, అ నీరు సరఫరా అయినన్ని రోజులు కెసి కాలువకు కూడా నీరు అందించాల్సిందేనన్నారు. ఈ యేడాది కెసి కాలువ కింద పొలాలకు రెండుకార్లు నీరు అందిస్తామని, ఈ విషయం సీఎం చంద్రబాబునాయుడు దృష్టిలో కూడా ఉందన్నారు. ముఖ్యంగా రైతులకు అవసరమయ్యే సాగునీరు, తాగునీరు గానీ నందికొట్కూరు నియోజకవర్గం నుంచి ఇతర రాష్ట్రాలకు తరలించుకుపోతున్నా నియోజకవర్గ పరిధిలోని రైతులకు సాగునీరు అందక వర్షాధారంపైనే అధారపడుతూ, వర్షం వస్తే పంట వస్తుంది, లేకపోతే నష్టం వచ్చే పరిస్థితి ఉన్నందున, ఎలాగైనా సరే ఈ సమస్య నుంచి గట్టెక్కించేందుకు సీఎం చంద్రబాబు మిడుతూరు, నందికొట్కూరు మండలాలకు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందిస్తారన్నారు. ఇప్పటి వరకు కళ్లెదుటే పుష్కలంగా సాగునీరు ఉన్నా రైతుల కళ్లలో కన్నీరు మిగిలిందేగానీ, ఎలాంటి ఉపయోగం లేని పరిస్థితి ఉందన్నారు. పంటలు బాగా పండాలంటే ముందుగా మంచి విత్తనం ఎంచుకోవాలని, అలాంటి విత్తనాలు అమ్మే వ్యాపారులు నాణ్యత గల విత్తనాలు రైతులకు విక్రయించాలని, సరైన సమయంలో ఎరువులు, పురుగు మందులు రైతులకు అందుబాటులో ఉంచాలని వ్యాపారులను కోరారు. రైతులతోనే మీ వ్యాపారాలు ముడిపడి ఉన్నాయి కాబట్టి మీరు రైతుల సంక్షేమం కోసం అనుమతులు ఉన్న కంపెనీల బ్రాండ్లను విక్రయించాలన్నారు. మీ సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాగా కాంప్లెక్స్ ఎరువులు, యూరియా కొరత ఎక్కువగా ఉందని ఈ సందర్భంగా వ్యాపారులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జాకీర్‌బాషు, చిన్న రాజు, వ్యాపారులు నాయుడు, రంగారెడ్డి, అచ్చన్న, పెద్ద లక్ష్మయ్య, చిన్న లక్ష్మయ్య, రాముడు, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరంగనాదజస్వామి సన్నిదిజలో ఎంపిపి బైరెడ్డి శబరి



**జూపాడుబంగ్లా, ఆగస్టు 17, ప్రభాతవార్త**

జూపాడుబంగ్లా మండలంలోని శ్రీ తర్తూరు రంగసాదజ స్వామి సన్నిదిజలో నంద్యాల ఎంపి, తెలుగు దేశం పార్టీ ఫ్లోర్ లీడర్,జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ చెర్మెన్ డాక్టర్ బైరెడ్డి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బైరెడ్డి గ్రామంలోకి చేరుకోగాను గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో భాజ భజంత్రీలతో వందలాది మంది టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అధికారి శశికుమార్ ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో ఎంపి శబరికి స్వాగతం పలికి శ్రీ స్వామివారి తీర్థ ప్రసాదంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మున్సిపల్ చైర్మెన్ సుధాకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాగేశ్వరరావు, టిడిపి రాష్ట్ర నాయకులు కాకరవాడ చిన్న వెంకటస్వామి, మందడి కరుణాకరెడ్డి, తిరుమలరావు, పల్లెశివానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా కృషి చేస్తా

**- టిడిపి మాజీ ఇంచార్జ్ గుడిసె కృష్ణమ్మ**



**ఆదోని,ఆగస్టు 17,ప్రభాతవార్త**

మార్కెట్‌యార్డులో వర్షానికి వేరుశనగ బస్తాలు తడిసిపోవడంతో నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా కృషి చేస్తానని టిడిపి మాజీ ఇంచార్జ్ గుడిసె కృష్ణమ్మ అన్నారు. శనివారం మార్కెట్‌యార్డులో నష్టపోయిన వేరుశనగ రైతులను గుడిసె కృష్ణమ్మ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథితో మాట్లాడి పరిహారం వచ్చేవిధంగా చేస్తామన్నారు. మార్కెట్‌యార్డు సెక్రటరీతో కలిసి నష్టపోయిన రైతుల వివరాలను ఆమె తెలుసుకున్నారు. ఇలా జరగడం చాలా భాదాకరమని ప్రభుత్వ అధికారులతో మాట్లాడి పరిహారం ఏర్పాటు చేయాలని సెక్రటరీతో మాట్లాడారు. భవిష్యత్తులో ఇలాంటివి జరుగకుండ శాశ్వత పరిష్కారం చూపే విధంగా ఎమ్మెల్యే,కూటమి సభ్యులందరు కలిసి నిర్ణయం తీసుకుంటామని ఆమె తెలిపారు.

# జాతీయ క్యారమ్స్ క్రీడాకారిని లిఖీతరెడ్డి మృతి



**కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన జాతీయ క్యారమ్స్ క్రీడాకారిని వి లిఖీతరెడ్డి శనివారం జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం దర్మవరం స్టేజి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. లిఖీత రెడ్డి ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి సుమారు 8 సార్లకుపైగా రాష్ట్ర జట్టుకు పాల్గొని అనేక పతకాలు సాధించారు. పదికిపైగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. లిఖీతరెడ్డి మృతికి రాష్ట్ర క్యారమ్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు డా.నిరాజ్ కుమార్, సంపతి అబ్దుల్ జలిల్, కర్నూలు జిల్లా కార్యదర్శి చెన్నకేశవరాజుతో పాటు జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు జగదీష్ గౌడ్, శ్రీనివాసులు సంతాపం తెలిపారు.

# జీనియస్ గ్లోబుల్ స్కూల్ ను సీజ్ చేయాలి

గోనెగండ్ల ఆగస్టు 17 ప్రభాతవార్త
ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేఖంగా ఫిట్‌నెస్ లేని బస్సులు, టాటా ఎసీ, టాటా సుమోలలో విద్యార్థులకు తరలిస్తున్న రోడ్డు పై వెలుతున్న వ్యక్తుల ప్రాణాలతో చెలగాటం అడుతున్న జీనియస్ గ్లోబుల్ స్కూల్ యాజమాన్యంపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం గోనెగండ్లలోని ఎమ్మిగనూరు, కర్నూలు ప్రధాన రహదారిపై అరగంట రాస్తారోకో నిర్వహించారు. అనంతరం స్కూల్‌లోకి వెళ్లిన విద్యార్థి సంఘాల నాయకులు యాజమాన్యానికి వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ శనివారం ఉదయం గంజహళ్లి గ్రామానికి చెందిన విద్యార్థులకు కోసం వెలుతున్న జీనియస్ గ్లోబుల్ స్కూల్ బస్సు రోడ్డుపై దరగయ్య అనే వ్యక్తిని డీ కొన్ని ఆయన మృతి కి కారణం అయ్యారన్నారు. మృతి చెందిన వారి కుటుంబానికి పరిహారం కింద రూ. 25లక్షలు స్కూల్ యాజమాన్యం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ స్కూల్ లో పలు సమస్యలు ఉన్నప్పటికి విద్యాశాఖ అధికారులు పట్టించుకోవాడం లేదని ఇప్పటికై అధికారులు చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మునిస్వామి, ఏబీవీపీ భరత్, రాష్ట్రజాయింట్ సెక్రెటరీ ఎర్రిస్వామి, బీసీఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం మద్దిలేటి, శేఖర్, ఎన్ఎస్‌యూఐ వీరేష్ యాదవ్, నరసన్న, పీడీఎస్‌యూ మహేంద్రబాబు, రాజేష్, యూఎస్ఎఫ్ఐ ఉదయ్, ఏఫిఎస్ఎఫ్ ఉస్సేన్, డీఎస్‌వైఎస్ వెంకటేష్, వైఎస్ఆర్ఎస్‌యూ సోమశేఖర్, షరీప్, నాగరాజు, రవితేజ, రాముడు, జుబేర్, పాల్గొన్నారు.



# బదిలీపై వెళ్తున్న ఎస్ఐకి ఘన వీడ్కోలు..

**– ఎస్ఐ బి.టి.వెంకటసుబ్బయ్య సేవలు మరువలేనివి**

**గడివేముల, ఆగస్టు17, ప్రభాతవార్త;** బదిలీపై నందివర్గం పోలీస్‌స్టేషన్‌కు ఎస్ఐగా వెళుతున్న గడివేముల ఎస్ఐ బి.టి.వెంకటసుబ్బయ్యకు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు, రాజకీయ నాయకులు, పత్రికా విలేఖరులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది ఎస్ఐకు శాలువాలు, పూలాలలతో సత్కరించి ఘనంగా వీడో ్కలు తెలిపారు. రాజకీయ నాయకులు, మీడియా మిత్రులు ఎస్ఐకు శాలువాతో సన్మానం చేసి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు ఎస్ఐ మండల ప్రజలకు అందించిన సేవలు, చేధించిన కేసుల గురించి గుర్తు చేసుకున్నారు. ఎస్ఐ సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల మూడు నెలలపాటు గడివేముల పోలీస్‌స్టేషన్‌లో తాను ఎస్ఐగా సేవలు అందించానని, ఇటీవల తనకు ఉత్తమ సేవలు అందించినందుకుగానూ ఉత్తమ సేవా పురస్కారం అవార్డు లభించిందన్నారు. తనకు ఘనమైన వీడ్కోలు తెలిపిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. తనతో మండల ప్రజలందరూ మమేకమై తనకు తన విధులకు సహకరించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐలు వెంకటేశ్వర్లు, సలీం, హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు హిమాంసాహెబ్, చెన్నయ్య, సురేంద్ర, మహిళా పోలీసులు జ్యోతి, మీడియా మిత్రులు పాల్గొన్నారు.

# నంద్యాల డీటీగా సంజీవరావు

**నంద్యాల టెక్కె, 17 ఆగష్టు, ప్రభాతవార్త:** నంద్యాల మండల డిప్యూటీ తహశీల్దారుగా (డీటీ) ఓ.కె.రామ సంజీవరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. డీఆర్ఓ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్న ఆయనను ఉన్నతాధికారులు నంద్యాల తహశీల్దారు కార్యాలయానికి డీటీగా బదిలీ చేశారు. నంద్యాలలో డీటీగా విధులు నిర్వహిస్తున ్న మల్లికార్జునరెడ్డి బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో సంజీవరావు డీటీగా విధుల్లో చేరారు.

# మద్దతు తెలిపిన విద్యార్థి, యువజన సంఘాలు

**నంద్యాల టెక్కె, 17 ఆగష్టు, ప్రభాతవార్త:** జూనియర్ డాక్టర్ మౌమితను హత్యను నిరసిస్తూ శనివారం వైద్యులు చేపట్టిన ఆందోళనకు విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విదా ్యర్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంకిరి రామచంద్రుడు, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాంబాబు, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్‌లు మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్ డాక్టర్ మౌమిత హత్య కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరిపి వైద్యుల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. వైద్యురాలు మౌమితను అత్యాచారం చేసి పాశవికంగా హత్య చేసిన సైకోలను బహిరంగంగా ఉరి తీయాలని డిమాండ్ చేశారు.

# పిల్లలను పనిలో చేర్చుకుంటే చర్యలు

**కొలిమిగుండ్ల, ఆగస్టు17, ప్రభాతవార్త:** 18 సంవత్సరాలలోపు పిల్లలను పనిలో చేర్చుకుంటే వారి పై చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శోభలత హెచ్చరించారు. శనివారం మండలంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శోభలత పలు షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్‌లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లలను పనుల్లో పెట్టుకోకూడదని ఒకవేళ పిల్లలను షాపుల్లోగాని, ఫ్యాక్టరీల్లోగాని పనుల్లో ఉంచుకుంటే వారి పై కేసు నమోదుచేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

# వైద్యులపై జరిగే దాడులను అరికట్టాలి

**- డాక్టర్ తిరుపాలు**




**మిడుతూరు, ఆగస్టు17, ప్రభాతవార్త;** కలకత్తా సిటీలో విధులు నిర్వహిస్తున్న మహిళా డాక్టర్ పై హత్యాచారం జరిగిన ఘటనకు నిరసనగా డాక్టర్ తిరుపాలు ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్లు, వైద్య సిబ్బంది కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర మాట్లాడుతూ బాధితురాలు కుటుంబానికి న్యాయం జరగాలని రాష్ట్రవ్యాప్తంగా ర్యాలీ కార్యక్రమాలు చేపటట్టం జరిగిందన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలతో పాటు వైద్యులపై జరిగే దాడులను అరికట్టాలంటూ తహసీల్దార్ కార్యాలయంలో స్థానిక పోలీసు స్టేషన్‌లో వినతి పత్రం అందజేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే వైద్యులు వైద్యశాలలో 24 గంటలు పనిచేయలేరని, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు, సిబ్బంది కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు భరత్‌కుమార్, శశరద, సాయి సుధా, వైద్యసిబ్బంది సత్యనారాయణ, మూర్తుజావలి, ప్రశాంతి, సూర్యం, యమునా, శ్రీజ, మౌలాలి, చంద్రకళ, శివాని, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

# సర్కిల్ ఇన్స్పెక్టరు హనుమంతు నాయక్‌ను కలిసిన యస్‌టిలనాయకుడు

**కోవెలకుంట్ల, అగస్టు 17, ప్రభాతవార్త :** కోవెలకుంట్ల సర్కిల్ ఇన్స్పెక్టరుగా నూతనంగ బాద్యతలు చేపట్టిన హనుమంతునాయక్‌ను యస్‌టిల నాయకుడు కోవెలకుంట్ల టౌన్ తెలుగు దేశం పార్టిఇంచార్జి అయిన పెనుగొండ రాజశేఖరు శనివారము కలిసి పుష్పగుచ్ఛము అందించి స్వాగతము పలికారు. ఇటీవల సాదారణ బదలీలో బాగంగా ఇక్కడ పని చేస్తున్న సిఐ జయచంద్ర సొంత జిల్లా చిత్తూకు వెళ్లడము అళ్లగడ్డ రూరల్ సిఐగా పని చేస్తున్న హనుమంతు నాయక్‌ను కోవెలకుంట్ల సర్కిల్ ఇన్స్పెక్టగా నియమించడమయు అయన బాద్యతలు చేపట్టారు. అందులో బాగంగా టౌన్ తెలుగు దేశం పార్టి నాయకుడు పెనుగొండ రాజశేఖరు శనివారము అయనను కలిసి పుష్పగుచ్ఛము అందించి స్వాగతించారు.



# జూనియర్ డాక్టర్‌ను అత్యాచారం చేసిన నింధితులను కఠినంగా శిక్షించాలి

**పత్తికొండ, ఆగస్టు 17, ప్రభాతవార్త**

వెస్ట్ బెంగాల్‌లోని ఆర్జికర్ మెడికల్ కాలేజీలో పిజీ వైద్య విద్యార్థిని మోమిత అనే జూనియర్ డాక్టర్‌పై అత్యాచారయత్నం చేసినటువంటి దోషులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కల్పన అన్నారు. శనివారం ప్రభుత్వ ఆసుపత్రి నుండి డాక్టర్లు అందరు ర్యాలీగా స్థానిక నాలుగు స్థంబాల కూడలి దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కల్పన మాట్లాడుతూ ప్రాణాలు కాపాడే డాక్టర్ల ప్రాణాలు తీయొద్దని కోరారు. సీనియర్ వైద్యులు డాక్టర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ ఎంతో ఒత్తిడితో వైద్యం చేసే డాక్టర్స్‌ని క్రూరంగా హత్య చేయడం చాలా భాదాకరమన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరుణ్ మాట్లాడుతూ మేము ప్రజలకు సేవలు చేయాలంటే మాకు న్యూ సెంట్రల్ ప్రొటెక్ట్ యాక్ట్ తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆదినాగేష్, డాక్టర్ హారిక, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ రాజేష్, పత్తికొండ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చెక్క నాగరాజు, బొంతల రంగా ఆద్వర్యంలో ఉదయం నుండి మధ్యాహ్నం 2గంటల వరకు మెడికల్ షాప్స్ బంద్ చేసి నిరసన తెలిపారు. ఈ హాస్పిటల్ క్లినిక్ వారు కూడా నిరసనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, ఆర్ఎంపి వైద్యులు పాల్గొన్నారు.

# దేశంలో ఆడబిడ్డలకు రక్షణ కరువైంది..!

**పత్తికొండ, ఆగస్టు 17, ప్రభాతవార్త**

మన దేశంలో ఆడబిడ్డలకు రక్షణ కరువైందని ఐఏఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేంద్రకుమార్ అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల ఆయన మాట్లాడుతూ వెస్ట్ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని వైద్య కళాశాల, ఆసుపత్రిలో రాత్రి విధులు నిర్వహించే ట్రైనీ డాక్టర్‌ను అత్యాచారం చేసి, హత్య చేయడం చాలా దుర్మార్గమన్నారు. ఇలాంటి హేయమైన నేరాలకు పాల్పడిన దుండగులపై తక్షణమే ఆ రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి కేసులను నింధితుల తరుపున న్యాయవాదులు ఎవరు వాదించరాదని తీర్మాణం చేయాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కమిటీకి విజ్ఞప్తి చేశారు.

# జర్నలిస్టులకు అండగా ఉంటా...

**– జర్నలిస్టుల హక్కుల కోసం ఏపీయూడబ్ల్యుజే చేస్తున్న పోరాటాలు అభినందనీయం**
**– కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి**

**కర్నూలు విద్య, ఆగష్టు 17, ప్రభాతవార్త:** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషిచేయడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నానని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హామి ఇచ్చారు. శనివారం ఆంధ్రప్రదేశ్ యూనియన్ అఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఏపీయూడబ్ల్యుజే) 67వ వార్షికోత ్సవం పురస్కరించుకొని నగరంలోని వెంకటరమణ కాలనీ ఉన్న కీర్తన అనాధశరణాలయంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. అంతకుముందు ఏపీయుడబ్ల్యుజే పతకాన్ని సీనియర్ జర్నలిస్టు జిల్లా గౌరవ అధ్యక్షులు ఎన్‌వి సుబ్బయ్య ఎగురవేశారు. అనంతరం పిల్లల మధ్య ఎమ్మెల్యే దస్తగిరి కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. అనాధ శరణాలయం పిల్లలకు ఎమ్మెల్యే అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో మీడియా 4వ ఎస్టేట్ అన్నారు. ప్రజలకు పాలకులకు మధ్య వారధిగా అంటూ సమాజంలో ఎక్కడ ఏ మూలకు ఏమి జరిగినా ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర మరవలేనిది అన్నారు. అలాగే జర్నలిస్టుల హక్కుల కోసం ఏపీయుడబ్ల్యుజే చేస్తున్న కృషి కూడ అభినందనీయం అన్నారు. జర్నలిస్టులు ప్రస్తుతం అనుభవిస్తున్న అక్రిడేషన్, బస్సుపాసు, హెల్త్‌కార్డులు, ఇన్సురెన్స్, ఇళ్ళస్థలాలు తదితరాలు అన్ని ఏపీయుడబ్ల్యుజే సాధించినవే అన్నారు. జర్నలిస్టులకు రక్షణగా వారిపై ఎక్కడ ఏమి జరిగినా అండగా ఉంటూ చేస్తున్న పోరాటం మరువలేనిది అన్నారు. సిఎం చంద్రబాబు మీడియాకు స్నేహితుడని జర్నలిస్టుల సమస్యల పరిష్కారం ఆయనతోనే సాధ్యమన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలన్ని సిఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యలపరిష్కారానికి తన వంతు కృషిచేస్తానని హామి ఇచ్చారు. ఈకార్య క్రమంలో ఐజెయు నాయకులు కొండప్ప, కె నాగరాజు, ఏపీయుడబ్ల్యుజే జిల్లా గౌరవ సలహాదారులు వైవి కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈఎన్ రాజు, కె శ్రీనివాసగౌడ్, అనాధ శరణాలయం నిర్వాహకులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏపియూడబ్ల్యూజే 67వ వార్షికోత్సవం

**– అనాధ ఆశ్రమంలో నిత్యవసర సరుకులు పంపిణి**
**– ఏపియూడబ్ల్యూజే జెండా అవిష్కరణ**



**ఎమ్మిగనూరు , ఆగష్టు 17 ప్రభాతవార్త:**
ఏపియూడబ్ల్యూజే 67వ వార్షికోత్సవాన్ని ఎమ్మిగనూరులో ఘనంగా నిర్వహించారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి గాంధీ విగ్రహనికి, అంబేద్కర్ విగ్రహనికి, సోమప్ప సర్కిల్ నందు సోమప్ప విగ్రహలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఏపియూడబ్ల్యూజే తాలుకా అధ్యక్షులు బి.శ్రీనివాస నాయుడు, ప్రధాన కార్యదర్శి చిన్న ఆకుల నాగరాజు, పట్టణ అధ్యక్షుడు పరమేశ్వర, జిల్లా ఉపాధ్యక్షుడు జాలవాడి బాషా, సహయ కార్యదర్శి నూర్ అహ్మద్‌లు, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.రామకృష్ణల అధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. అనంతరం సోమప్ప సర్కిల్ నందు న్యాయ సలహదారులు అష్రఫ్, మల్లెల గ్రూప్ ఛైర్మన్, సామాజికవేత్త మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు, దేవేంద్ర రెడ్డిలు జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం పూలే అంబేద్కర్ ఎడ్యుకేషనల్ సోసైటి పేద అనాధ బాల బాలికల సంరక్షణ కేంద్రానికి నిత్యవసర సరుకులను అందచేశారు. ఈసంధర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నాటి నుండి నేటి వరకు జర్నలిస్టుల హక్కుల సాధనకు పాటుపడిన ఏకైక జర్నలిస్టు సంఘం ఏపియూడబ్ల్యూజే అని తెలియచేశారు. ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారదిగా ఉండటంతో పాటు సమాజ నిర్మాణానికి పాటుపడుతున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఏపియూడబ్ల్యూజే నాయకులు 99టివి ఈరన్న, ఖాశీమ్, వెంకటాపురం నాగరాజు, యల్లయ్య, ఆవుల శ్రీనువాసులు, రాజశేఖర్, తిరుమల వెంకటేష్, ముగతి సోమన్న తదితరులు పాల్గొన్నారు.

# వయోజన విద్య అసిస్టెంట్ డైరెక్టరు సంపంగి వెంకటేశ్వర్లుకు ఉత్తమ పురస్కారం

**పాములపాడు, ఆగష్టు 17, ప్రభాతవార్త:** కర్నూలు జిల్లా వయోజన విద్య అసిస్టెంట్ డైరెక్టర్ సంపంగి వెంకటేశ్వర్లు ఉత్తమ పురస్కారానికి ఎంపికయ్యారు. 78వ స్వాతంత్ర్య దినోత ్సవ సందర్భంగా రాష్ట్ర మంత్రి టీజీ భరత్, జిల్లా కలెక్టరు పి రంజిత్ బాషల చేతులమీదుగా జిల్లా వయోజన విద్య అసిసె ్టంట్ డైరెక్టర్ సంపంగి వెంకటేశ్వర్లు ఉత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. విధుల పట్ల అంకితభావంతో పనిచేసి వయోజన విద్యలో మంచి ఫలితాలు సాధించినందుకు ఉత ్తమ పురస్కారం లభించిందని వయోజన విద్య అసిసె ్టంట్ డైరెక్టర్ సంపంగి వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వయోజనుల విద్యలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వయోజనులకు అక్షరాస్యత కల్పించడంలో ప్రత్యే ్యక చొరవ తీసుకున్నారు. ఉత్తమ పురస్కారం అందుకున్న వయోజన విద్య అసిస్టెంట్ డైరెక్టరు సంపంగి వెంకటేశ్వర్లును సహర సిబ్బంది, ఆంధ్రప్రదేశ్ వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఓర్సు రామసుబ్బయ్య అభినందనలు తెలిపారు.



# వైద్యులకు రక్షణ కల్పించాలి... డాక్టర్ రాయుడు

**: నల్లబ్యాడ్జిలతో నిరసన**




**ఆత్మకూరు, ఆగష్టు17, ప్రభాతవార్త:** ప్రాణం పోసే వైద్యులకు రక్షణ కల్పించే విదంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోని విధి నిర్వహణలో ఉంటున్న మహిళ డాక్టర్లపై జరుగుతున్న ఘోరమైన దాడులు, అత్యాచారాలు అరికట్టే విదంగా ప్రభుత్వాలు ముందుకు రావాలని ఆత్మకూరు సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు రాయుడు, కవితలు అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో సిబ్బందితో కలసి నల్లమల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైద్యాధికారులు మాట్లాడుతూ పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని కలకత్తలో ఆర్.జి.కర్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యురాలికి జరిగిన అమానుష చర్యను తీవ్రంగా ఖండించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రాణం పోసే వైద్యుల ప్రాణం తీయకండి వైద్యులపై దాడులు అరికట్టి ప్రజా ఆరోగ్యంపై నిత్యం సేవలు అందిస్తున్న మా రక్షణ ప్రభుత్వం బాద్యత ఉండాలన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది చేస్తున్న సేవలను గుర్తించక పోయిన పర్వలేదు సాటిమనిషిగా గుర్తించాలన్నారు. ప్రభుత్వం నిబద్దతో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలు విధులకు అటంకం కలిగించకుండా సేవలను వినియోగించుకోవాలని అన్నారు. ప్రాణం పోసే వైద్యులపైనే కొందరు మానవ మృగాలకు శిక్ష పడే విదంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే చర్య తీసుకోవాలన్నారు. వైద్యశాఖలో పనిచేస్తున్న మహిళ సిబ్బందిపై జరిగే ఘటనలు చూసిన్నప్పుడు మహిళగా పుట్టడమే పాపమా అంటూ కొందరు వైద్య ఆరోగ్య సిబ్బంది తమ ఆవేదన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నర్సింగ్ ఆఫిసర్ వసంత, సరోజినిదేవి, స్వాతి, టిబి సూపర్ వైజర్ రవికుమార్, టెకి ్నషియన్స్ ప్రసాద్, శివ, సుజాత, రమేష్, అంజలి, జబివుల్లా, ఆరోగ్య శ్రీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులు నిరసన..

**ఎమ్మిగనూరు , ఆగష్టు 17 ప్రభాతవార్త:** కోల్‌కత్తా జూనియర్ వైద్యురాలు అత్యాచార ఘటనకు నిరసనగా ఎమ్మిగనూరులోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు నిరసన ర్యాలీ చేపట్టారు. సంఘటనకు పూర్తిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భాధ్యత వహించాలని, సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కత్తాలో ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజి ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రైయినీ వైద్యురాలు మౌమిత దిబనంథ్ హత్యాచార ఘటనను నిరసిస్తూ శనివారం ఎమ్మిగనూరు వైద్యుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యశాల నుండి సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఈకార యక్రమంలో వైద్యులు మాలకొండయ్య, గౌడప్ప గౌడ్, బాలాజీ, మల్లికార్జున, మనోజ్, శ్రీనివాసులు, వైద్యురాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# కేరళ వరద భాదితులను ఆదుకునేందుకు ముందుకు రావాలి

**– ఏపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు**

**ఆలూరు, ఆగస్టు 17, ప్రభాతవార్త :** కేరళ రాష్ట్రం వయనాడ్‌లో వరద భాదితులను ఆదుకునేందుకు ప్రతిఒక్కరు ముందుకు రావాలని ఏపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి హనుమంతు, మండల కార్యదర్శి ఈరన్నలు కోరారు. శనివారం రైతుసంఘం ఆద్వర్యంలో మండల పరిధిలోని అగ్రహారం గ్రామంలో రైతులు, వ్యవసాయ కూలీల ద్వారా విరాళాలు సేకరించడం జరిగింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో వయనాడ్ ప్రాంతంలో వరదలు ముంచెత్తడంతో అక్కడి ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బ్రతకాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కొండ చరియలు విరిగిపడి వెల్లువెత్తిన వరద ధాటికి దాదాపుగా 400మంది ప్రాణాలు మట్టిలో కలిసిపోయారని, ఆప్తులను కోల్పోయి వేలాదిమంది నిరాశ్రయులుగా నిస్సహాయులుగా మారారని కొంతమంది వరదల్లో కొట్టుకుపోయి గల్లంతు అయ్యారన్నారు. దీనస్థితిలో ఉన్న ప్రజలను ఆదుకోవడం ప్రతిఒక్కరి భాద్యత అని తెలిపారు. వయనాడు వరద భాదితులను ఆదుకునేందుకు తమవంతుగా మానవతాదృకృథంతో సహాయం చేసిన అగ్రహారం గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విరాళంగా సేకరించిన రూ. 3100ను కేరళ ముఖ్యమంత్రి సహాయ నిధికి అందేవిధంగా ఏపి రైతుసంఘం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు శేఖర్, కృష్ణ, విఠల్, నారాయణ పాల్గొన్నారు.



# బియ్యం బండి అపరేటర్‌పై చర్యలు తీసుకోవాలి

**కొత్తపల్లి, ఆగష్టు 17, ప్రభాతవార్త:** కొత్తపల్లి మండలంలోని పాలెం చెరువు బియ్యం బండి అపరేటర్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ మశమ్మ అన్నారు. ఆమె శనివారం మాట్లాడుతూ పాలెం చెరువు చెంచుగూడెంలో బియ్యం బండి అపరేటర్ గత నెలలో కొంత మందితో వేలిముద్రలు బియ్యం పంపిణి చేయలేదని ఆరోపించారు. శుక్రవారం ఎందుకు బియ్యం పంపిణి చేయలేదని గ్రామ సర్పంచ్ అతన్ని అడగ్గా కుమార్ తన భార్యతో కలిసి దాడిచేశారన్నారు. ఈవిషయంపై పోలీస్‌స్టేషన్, తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామన్నారు.

# వాయిదా పడిన పాఠశాలలో ఎన్నికలు పూర్తి

**పెద్దకడుబూరు, ఆగస్టు 17, ప్రభాతవార్త :** ఈ నెల 8న ప్రభుత్వ పాఠశాలలో విద్యాకమిటీ చైర్మన్‌కు ఎన్నికలు నిర్వహించారు. మండలంలో గవిగట్టు, పులికనుమ, హెచ్ మురవని, కంబలదిన్నె పాఠశాలల్లో అనివార్య కారణాల వల్ల ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఆ పాఠశాలలకు సంబంధించి రెండవసారి శనివారం విద్యాధికారులు ఎన్నికలు నిర్వహించారు. నాలుగు పాఠశాలల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గవిగట్టు జిల్లా పరిషత్ విద్యాకమిటీ చైర్మన్‌గా టిడిపికి చెందిన దానప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రాథమిక పాఠశాలకు వైసిపి మద్దతుదారుడు విద్య కమిటీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అలాగే కంబలదిన్నె పాఠశాలలో జిల్లా పరిషత్ ఎలిమెంట్ స్కూల్, బిసి స్కూల్ పాఠశాలల విద్యాకమిటీ చైర్మన్లుగా టిడిపి మద్దతుదారులు ఎన్నికయ్యారు. ఎస్‌సి స్కూల్‌కు వైసిపి మద్దతుదారుడు విద్యాకమిటీ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అలాగే హెచ్ మురవని జిల్లా పరిషత్ పాఠశాల చైర్మన్‌గా టిడిపి మద్దతుదారుడు దస్తగిరి ఎన్నిక కాగా ఎలిమెంట్ స్కూల్‌కు విద్యాకమిటీ చైర్మన్‌గా వైసిపి మద్దతుదారుడు వెంకటేష్ ఎన్నికయ్యారు. పులికనుమ పాఠశాల విద్యాకమిటీ చైర్మన్‌గా టిడిపి మద్దతుదారుడు గురుమూర్తి ఎన్నికయ్యారు. ఎన్నికైన చైర్మన్లు టిడిపి నాయకులు, టిడిపి నేతలు రమాకాంత్‌రెడ్డి, రామకృష్ణారెడ్డిలను కలిశారు. వీరిని టిడిపి నాయకులు శాలువా, పూలమాలతో సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గవిగట్టు టిడిపి నాయకులు బసవరాజు, శాంతప్ప, మునిస్వామి, హెచ్ మురవణి టిడిపి నాయకులు సత్య, రామలింగ, రంగయ్య, నరసయ్య, పులికనుమ టిడిపి నాయకులు సత్య, ఓబులేషు తదితరులు పాల్గొన్నారు. అలాగే వైసిపి నాయకులు నాగరాజు, గాదిరెడ్డి, దేవదానం, పరమేష్, మహాదేవ, నల్లారెడ్డి, అల్లయ్య, రంగముని తదితరులు వైసిపి మద్దతుతో ఎన్నికైన విద్యాకమిటీ చైర్మన్లను సన్మానించారు. ఎన్నికలను ప్రశాంతంగా జరిగేందుకు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి ఆద్వర్యంలో ఆయా పాఠశాలలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# గ్రామాలను అభివృద్ధి చేసుకుందాం

**-ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి**




**బండిఆత్మకూరు, ఆగష్టు 17, ప్రభాతవార్త:** గ్రామాల అభివృద్ధి కోసం జెండాలు, ఎజెండాలు పక్కన పెట్టి అందరం కలిసి గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని మండల అధ్యక్షులు దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు అందరం సమన్వయంతో కలిసి కట్టుగా పనిచేసి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని అధికారులను అదేశించారు. సర్పంచులు, ఎంపిటిసిలు గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే నాదృష్టికి తీసుకువస్తే వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. అనంతరం అయా శాఖాల అధికారుల వారి శాఖల పరంగా జరిగిన అభివృద్ధి గురించి వివరించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ వాసుదేవగుప్తా, వైస్ ఎంపీపీ రాగాల వెంకటరమణ, ఏపీఓ వసుధ, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ లక్ష్మీనరసింహా, ఏఓ హనిఫ్, వివిధశాఖల అధికారులు, గ్రామసర్పంచ్‌లు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

# బిఎల్ఓలు నూతన ఓటర్లుగా నమోదు చేయాలి

**మంత్రాలయం, ఆగస్టు 17, ప్రభాతవార్త:**
మండలంలోని బిఎల్ఓలు ఆయా గ్రామాల్లోని నూతన ఓటర్లుగా నమోదు చేయాలని డిటి రాఘవేంద్ర అన్నారు. శనివారం స్థానిక రెవిన్యూ కార్యాలయంలో బిఎల్ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రతిఇంటికి తిరిగి 2025 సంవత ్సరం జనవరి నెలకు 18 సం.లు నిండే ప్రతిఒక్కరిని నూతన ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. మృతిచెందిన ఓటర్లను తొలగించాలన్నారు. కావున బిఎల్ఓలు అందరూ తమ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేదిలేదన్నారు.



# రెండు పాఠశాలల్లో చైర్మన్ల ఎన్నిక

**కొత్తపల్లి, ఆగష్టు 17, ప్రభాతవార్త:** ఈనెల 8న మండలంలోని 42 ప్రభుత్వ పాఠశాలలకు చైర్మన్, వైస్ చైర్మన్ల ఎని ్నకలు జరిగాయి. ఇందులో చిన్న గుమ్మడాపురం, ముసలిమడుగు ఉర్దూ పాఠశాలలో కోరం లేకపోవడంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఈరెండు పాఠశాలలకు శనివారం అయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రామకృష్ణయ్య, షేక్ రుక్సానాల ఆధ్వర్యంలో ఎంఈఓ బ్రహ్మం నాయక్ పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. ఇందులో చిన్నగుమ్మడాపురం ప్రాధమిక పాఠశాల చైర్మన్ ఎన్ రాణి, వైస్ చైర్మన్‌గా ఎన్ ప్రభాకర్, ముసలిమడుగు ఉర్దూ పాఠశాల చైర్మన్‌గా షేక్ మాసుం, వైస్ చైర్మన్‌గా ఎస్ ముబినాలు ఎన్నికైనట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. పాఠశాల అభివృద్దిలో వీరు భాగస్వాములు అవ్వాలని వారిని కోరారు.



# కరుడుగట్టిన గొలుసు దొంగ అరెస్టు

– 210.75 గ్రాముల బంగారం రికవరీ

**కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 17, ప్రభాతవార్త:** కర్నూలు నగరంలో విచ్చలవిడిగా గొలుసు దొంగతనాలు చేస్తున్న నేరస్థున్ని కర్నూలు పోలీసులు అరెస్టు చేశారు. కేవలం మహిళల మెడలో గొలుసులే టార్గెట్‌గా దొంగతనాలుచేస్తున్న అతనిని పట్టుకునేందుకు రెండు పోలీస్‌స్టేషన్‌ల నుంచి ప్రతే్యక బృందాలను ఏర్పాటుచేసి కేసు చేధించారు. ఈవిషయం శనివారం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో విలేఖరుల సమావేశం నిర్వహించారు. కర్నూలు త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ మురళీదర్‌రెడ్డి, ఫోర్త్‌టౌన్ ఇన్‌స్పెక్టరు శంకరయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దేవనకొండ మండలం పేర్నెకల్ గ్రామానికి చెందిన వీరేష్‌కుమార్ కర్నూలు నగరంలో గత సంవత్సర కాలంగా చైన్‌సా్నచింగ్‌లకు పాల్పడుతున్నారు. తాజాగా గణేష్ నగర్ ప్రాంతంలో జరిగిన ఒక చైన్‌స్నాచింగ్ కేసులో పోలీసులకు అధారాలు లభించడంతో చేధించారు. మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 7 చోట్ల జీన్స్‌మ్యాచ్ పాల్పడ్డారు. నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక చోట చైన్‌స్నాచింగ్‌కు పాల్పడ్డారు. ఈ 8 కేసులను పోలీసులు చేధించారు. విచారించగా నేరాలు చేసినట్లు అంగీకరించారు. అందుకు సంబంధించి బంగారు అభరణాలు ఎక్కడ పెట్టారు అనే విషయాలపై వివరణ జరిపి వాటిని పోలీసులు సా్వధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా మురళీదర్‌రెడ్డి మహిళలకు ప్రత్యేక సూచనలు చేశారు. ఉదయం మార్నింగ్ వాక్ వెళ్లె మహిళలు అభరణాల పట్ల కచ్చితంగా జాగ్రత్త వహించాలన్నారు. కుదిరితే విలువైన బంగారు అభరణాలు ఇంట్లో పెట్టి వాకింగ్‌కు రావాలని అలా కానీపక్షంలో మెడచుట్టు చీర గానీ, మప్లర్ లాంటి గుడ్డ కప్పుకోవాలని సూచించారు. అదేవిధంగా సిసి కెమెరాల విషయంలో కూడ ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సహకరించాలని ఆయన సూచించారు.



# పగిడ్యాల ఏపిమోడల్‌స్కూల్ యాజమాన్యకమిటీ చైర్మెన్‌గా నరసింహ ఎన్నిక



**పగిడ్యాల, ఆగస్టు 17, ప్రభాతవార్త**

మండల కేంద్రమైన పగిడ్యాలలోని ఏపి మోడల్‌స్కూల్ యాజమాన్యకమిటీ చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నికలను శనివారం నిర్వహించారు. కోరం లేనికారణంగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు గతంలో వాయిదా పడిన విషయం విదితమే. అయితే ఎట్టకేలకు శనివారం నిర్వహించిన ఏపిమోడల్ స్కూల్ యాజమాన్య కమిటీ ఎన్నికలలో చైర్మెన్‌గా నరసింహా, వైస్ చైర్మెన్‌గా సముద్రం సుజాత ఎన్నికైనట్లుప్రిన్సిపాల్ సుజన తెలిపారు. ఈ నెల 8వతేదీన మండల పరిధిలోని 4 జెడ్పీపాఠశాలలు, 20 ప్రాథమి పాఠశాలలు, 2 ప్రాథమికోన్నత పాఠశాలలు, ఏపిమోడల్ స్కూల్, కస్తూర్భాపాఠశాల, డాక్టర్ బిఆర్. అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలకు యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించగా చైర్మెన్, వైస్ చైర్మెన్ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగిందనీ మండల విద్యాశాఖాధికారి పి.సుభాన్, మండల విద్యాశాఖాధికారి –2, మురళీమోహన్‌రెడ్డిలు తెలిపారు. అయితే ఏపి మోడల్‌స్కూల్, పగిడ్యాల జెడ్పీపాఠశాలకు పాఠశాల యాజమాన్యకమిటీ ఎన్నికలు నిర్వహించగా ఏపి మోడల్‌స్కూల్, పగిడ్యాల జెడ్పీపాఠశాలలో కోరం లేనందున ఎన్నికలు వాయిదావేశారు. అయితే శనివారం ఏపి మోడల్‌స్కూల్ యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించగా చైరె్మన్‌గా నరసింహా, వైస్ చైర్మెన్‌గా సముద్రం సుజాత ఎన్నుకోవడంతో పాఠశాల ప్రిన్సిపాల్, పాఠశాల అధ్యాపకబృందం సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. అయితే పగిడ్యాల జెడ్పీపాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు రెండవదఫా కోరం లేనందున వాయిదా పడినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. మధుసూధనరావు తెలిపారు. మండలంలోనిరెండు పాఠశాలలు మినహా 8వతేదీన అన్నిపాఠశాలల యాజమాన్యకమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయనీ, ఏపి మోడల్‌స్కూల్, పగిడ్యాల జెడ్పీపాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు కోరంలేనందున వాయిదా వేయడం జరిగిందనీ, మండల విద్యాశాఖాధికారి పి.సుభాన్ తెలిపారు. అయితే శనివారం ఏపిమోడల్ స్కూల్ యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించగా చైరె్మన్,వైస్ చైర్మెన్ ఎన్నుకోవడం జరిగిందనీ, పగిడ్యాలజెడ్పీపాఠశాల యాజమాన్యకమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు కోరంలేనందున వాయిదా పడిందనీ, ప్రభుత్వ ఉత్తర్వులు రాగానే నిర్వహించడం జరుగుతుందనీ మండల విద్యాశాఖాధికారి పి.సుభాన్ తెలిపారు.

# పూర్వవిద్యార్థుల రక్తదానం




**ఎమ్మిగనూరు. ఆగష్టు 17ప్రభాతవార్త:**

ఎమ్మిగనూరు పట్టణంలోని స్వామి వివేకనంద స్వచ్ఛంద కార్యలయం నందు పూర్వ విద్యార్థులు అలుమని వెల్‌ఫేయిర్ ట్రస్ట్ వారు గురువారం రక్తదానం కార్యక్రమాని నిర్వహించారు. ఈకార్యక్రమాని నిర్వహకులు తిరుమల ఆధ్వర్యంలో ఏర్పటు చేయగా పూర్వపు విద్యర్థులు జవహరలాల్ నవదోయ విధ్యార్థులు కలయక సందర్భంగా పంద్రాగస్టు వేడుకలును ముందుగా నిర్వహించుకోని రక్తదాన కార్యక్రమాని చేశారు దాదాపు విద్యార్థులు 40 మంది రక్తదానం చేశారు. ఈసందర్భంగా పూర్వ విధ్యార్తులు మాట్లాడుతూ ఎన్నోరోజుల నుండి మా కలయిక రక్తదానం రూపంలో మేము కలవడం ఎంతో సంతోషంగా ఉందని దీనికి తోడ్పడిన తిరుమల అన్నకు ప్రత్యేక ధన్యవాదుములు తెలిపారు. మహాత్మ గాంధీ బ్లెడ్ సెంటర్ టెక్నిషయన్‌లు, మెడికల్ అధికారి మల్లికార్జున వారి సంక్షంలో చేశారు. ఈకార్యక్రమల్లఓ మహేశ్,వరుణ్, నరహరి, కృష్ణ, ప్రతాప్,మెహన్,రాఘవేంద్ర, సల్మాణ , విశ్వకాంత్, రవి తదితరులు పాల్గోన్నారు.

# హనవాలు విద్యాకమిటీ వైస్ చైర్మన్‌గా హుసేనమ్మ



**ఆదోని రూరల్,ఆగస్టు 17,ప్రభాతవార్త :** హనవాలు గ్రామంలో విద్యాకమిటీ వైస్ చైర్మన్‌గా సిపిఎం మద్దతుదారులు పి హుసేనమ్మను విద్యార్థుల తల్లిదండ్రులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు,గ్రామ పెద్దలకు, ఉపాధ్యాయులకు సిపిఎం మండల నాయకులు భాష,స్థానిక నాయకులు దస్తగిరి భాష,అబ్దుల్ రహీంలు ధన్యవాదాలు తెలియజేశారు.

# ప్రతిఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలి



**ఆదోని రూరల్,ఆగస్టు 17,ప్రభాతవార్త :** పరిసరాల పరిశుభ్రతను ప్రతిఒక్కరు పాటించాలని వైసిపి నాయకులు అళ్లమ్మ గారి పురుషోత్తంరెడ్డి అన్నారు. శనివారం సర్పంచ్ అళ్లమ్మ గారి సరళమ్మ ఆద్వర్యంలో మండల పరిధిలోని నారాయణపురం గ్రామంలో వీధివీధిన తిరిగి పారిశుద్ధ్య కార్మికుల చేత పారిశుద్ధ్య పనులు చేయించారు. ఈ సందర్భంగా పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ మురికి కాలువల దగ్గర మురుగునీరు నిల్వ లేకుండ శుభ్రం చేయండం జరిగిందన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండ ముందు జాగ్రత్తగా బ్లీచింగ్ పౌడర్ చల్లించడం జరిగిందన్నారు. అలాగే గ్రామస్తులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు.

# మెడికో విద్యార్థి హత్యాచార ఘటనపై న్యాయమూర్తితో విచారణ జరిపించాలి




**ఆదోని,ఆగస్టు 17,ప్రభాతవార్త**

కోల్‌కతా మెడికో విద్యార్థి అత్యాచార,హత్య ఘటనపై సుప్రకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు అఖండ డిమాండ్ చేశారు. శనివారం పిడిఎస్‌యు ఆద్వర్యంలో పట్టణంలోని ఎమ్మిగనూరు సర్కిల్ వద్ద మెడికో విద్యార్థి అత్యాచార ఘటనపై కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు అఖండ,జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జునలు మాట్లాడుతూ మెడికో విద్యార్థినిపై దారుణంగా అత్యాచారం జరిగిందని ఈ ఘటనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థులు,వైద్యులు విధులను బహిష్కరించి పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతున్నారన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం దుండగులను శిక్షించాలని లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రసూల్,వీరేష్,సునీల్,హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల స్వేచ్ఛకు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవు

**పెద్దకడుబూరు,ఆగస్టు 17,ప్రభాతవార్త**



ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్‌గా పిలవబడే మీడియా రంగంలో పనిచేస్తున్న జర్నలిస్టులు స్వేచ్ఛగా వార్తలు రాసినప్పుడే ప్రజలకు మేలు జరుగుతుందని కొంతమంది దురుద్దేశ్యంతో జర్నలిస్టుల స్వేచ్ఛకు ఆటంకం కలిగిస్తే అటువంటి వారిపై చర్యలు తప్పవని ఎస్ఐ నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రమైన పెద్దకడుబూరులో స్థానిక ప్రెస్‌క్లబ్ నందు జరిగిన ఏపియుడబ్ల్యుజె 67వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఎస్ఐ ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. ఎస్ఐతో పాటు టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్‌రెడ్డి,వైసిపి మండల కన్వినర్ రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, టిడిపి నాయకులు బొగ్గుల ఏసేపు,హనుమంతరెడ్డి,విజయ్ కుమార్,దశరథ రాముడు,మల్లికార్జున,మీసేవ ఆంజనేయులు,ఎంజి నరసన్న,సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న,పరమేష్,వైసిపి నాయకులు అర్లప్ప,సిపిఐ మండల నాయకులు వీరేష్,ఆంజనేయ,జనసేన మండల నాయకులు గణేష్,విద్యార్థి సంఘం నాయకులు రాజులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ఉదయం 6గంటలకే మన ముందు ఉంచేందుకు కృషి చేస్తున్న జర్నలిస్టులకు ప్రతిఒక్కరు అండగా ఉండాలన్నారు. ఏఒక్కరు కూడా జర్నలిస్టుల స్వేచ్ఛకు ఆటంకం కలిగించరాదని జర్నలిస్టులపై ఉద్దేశపూర్వకంగా దాడులు చేసినా అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ ప్రజలకు,ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల కృషి అభినందనీయమన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మహేష్,విఆర్ఓలు,ఏపియుడబ్ల్యుజె మండల అధ్యక్షులు బొగ్గుల సోమన్న,కార్యదర్శి రామన్న,కోశాధికారి ఎంసి నారాయణ,సీనియర్ జర్నలిస్టులు పుల్లయ్య, భీమన్న,మల్లికార్జున,ఏలియస్, లింగమూర్తి,రాజు,శివ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏపియుడబ్ల్యుజె ఆవిర్భావ వేడుకలు



**మంత్రాలయం, ఆగస్టు 17, ప్రభాతవార్త:** నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయంలో ఏపియుడబ్ల్యుజె 67వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా ఉపాధ్యక్షులు చాంద్‌భాష,సహాయ కార్యదర్శి హనుమేష్, తాలుకా,మండల అధ్యక్షులు జయరాజు,భీమరాయల ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు సిఐ పుల్లెం రామాంజులు ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత్రికేయుల సమస్యల పరిష్కారంలో ఏపియుడబ్ల్యుజె చాలా ప్రాముఖ్య పాత్ర పోషిస్తుందన్నారు. భవిష్యత్తులో సైతం పాత్రికేయుల ఉద్యమాలలో ఏపియుడబ్ల్యుజె యూనియన్ పోరాటాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తాలుకా ప్రధాన కార్యదర్శి హుసేని,కోశాధికారి సాబువలి, ఆర్గనైజింగ్ కార్యదర్శి సూర్యనారాయణ, రాఘవేంద్రగౌడు, నరసప్ప, సీనియర్ పాత్రికేయుడు వేణుగోపాల్‌రెడ్డి,మాదప్ప,మండల గౌరవ అధ్యక్షులు రానోజీరావు,కార్యదర్శి వెంకట్,కోశాధికారి రఫి,రామస్వామి,సాగర్,శ్రీధర్,వీరేష్,నరసింహ,దివాకర్,ప్రకాష్‌రెడ్డి,రామాంజినేయులు,ధనుంజయ,చిదానంద తదితరులు పాల్గొన్నారు.

# వైద్యులకు రక్షణ కల్పించాలి

వైద్యాధికారులు భావన, కవిత



**బండిఆత్మకూరు, ఆగష్టు 17, ప్రభాతవార్తః** కోల్‌కత్తాలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారానికి నిరసనగా మండలంలోని ప్రభుత్వాసుపత్రి నుండి ర్యాలీగా తహాశీల్దార్ కార్యాలయం వరకు డాక్టర్లు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహాశీల్దార్ దోని అల్‌ప్రేడ్‌కు వైద్యులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం మా బాధ్యత అని వైద్యులకు రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. వైద్యులకు రక్షణ చట్టాన్ని అమలుచేయాలని దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశాల వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి



**ఆదోని రూరల్,ఆగస్టు 17,ప్రభాతవార్త**

పట్టణంలోని మార్కెట్‌యార్డులో మొన్న సాయంత్రం కురిసిన వర్షానికి దాదాపు 285బస్తాల వేరుశనగ బుడ్డలు తడిసిపోయాయని దీంతో రైతులకు,వ్యాపారులకు పనికిరాకుండ పాడైపోవడం జరిగిందని కావున నష్టపోయిన రైతులందరికి క్వింటాల్‌కి రూ.7వేలు ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని వైసిపి పట్టణ అధ్యక్షులు దేవా అన్నారు. శనివారం మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు మార్కెట్‌యార్డులో వైసిపి పట్టణ అధ్యక్షులు దేవా నాయకులతో కలిసి మార్కెట్‌యార్డులో తడిసిపోయిన వేరుశనగ బస్తాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ యార్డులో సెక్రటరీతో పాటు అక్కడున్న సిబ్బంది కూడా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీంతో రైతులు నష్టపోవడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఈ నష్టానికి సమాధానం చెప్పాలన్నారు. ఎస్‌సి సెల్ టౌన్ సెక్రటరీ గంగాధర్,కల్లుపోతుల కోదండ,టౌన్ సెక్రటరీ తాయన్న, లక్ష్మీనారాయణ,నాగేష్,బాబుమోహన్,అయ్యప్ప,మణి,బాబు తదితరులు పాల్గొన్నారు.

# మండల అధికారులను కలిసిన జనసేన నాయకులు



**పాములపాడు, ఆగష్టు 17, ప్రభాతవార్తః** పాములపాడు మండలానికి ఇటీవల అధికారులు బదిలీపై వచ్చారు. ఈమేరకు శనివారం జనసేన పార్టీ నాయకులు రాము, సాయి కృష్ణ, ప్రభాకర్, అల్లా బకాష్‌లు తహాశీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీఓ గోపికృష్ణలను కలిసి పుష్పగుచ్చం అందించి సత్కరించారు. ఈసందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఈకార్యక్రమంలో జనసైనికులు కిరణ్, భాస్కర్, మనోజ్, సురేష్, హర్ష, మగ్బూల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యుల పై దాడులు అరికట్టాలి

– జూనియర్ వైద్యురాలిని హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి




**బనగానపల్లె, ఆగస్టు17, ప్రభాతవార్త:** కోల్‌కత్తాలోని ఆర్జీ కర్ మెడికల్ కళాశాలలో జూనియర్ వైద్యురాలి పై అత్యాచారం చేసి అతికిరాతకంగా హత్యచేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని మండలంలోని ప్రభుత్వ వైద్యులు, వైద్య సిబ్బంది డిమాండ్ చేశారు. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి పై జరిగిన ఘటనను నిరసిస్తూ పట్టణంలోని స్థానిక ప్రభుత్వ వైద్యశాల, టంగుటూరు ప్రాథమిక వైద్యశాలలకు చెందిన డాక్టర్లు, వైద్య సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. శనివారం వారు ప్రభుత్వ వైద్యశాల నుండి ర్యాలీగా బయలుదేరి పెట్రోల్‌బంకు కూడలిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మహిళలు, వైద్యులు, మహిళా వైద్యుల పై జరుగుతున్న దాడులను ప్రభుత్వాలు అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. విధుల్లో ఉన్న వైద్యుల పై దాడులకు పాల్పడే వారికి తక్షణమే శిక్షలు పడేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని వారు కోరారు. కోల్‌కతా ఘటన సభ్య సమాజం తలదించుకునే దురదృష్టకరమైన ఘటన అని మహిళా వైద్యురాలి పై అత్యాచారం అమానుషమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యుల పై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. అనంతరం వారు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సుజాత, శివశంకరుడు, ఎంపీహెచ్‌ఈవో నల్లగట్ల వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన మాచాపురం,పాలకుర్తి పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలు



**దేవనకొండ,ఆగస్టు 17,ప్రభాతవార్త**

మండలంలోని మాచాపురం,పాలకుర్తి గ్రామాల ఎంపిపిఎస్ పాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ తిమ్మారెడ్డి శనివారం విలేకర్లకు తెలిపారు. జిల్లెడు బుడకల గ్రామ పంచాయతీ మజార గ్రామమైన మాచాపురం గ్రామ ఎంపిపిఎస్ పాఠశాలకు యాజమాన్య కమిటీ ఎన్నికలు జరుగగా టిడిపి మద్దతుదారులు చైర్మన్‌గా బోయ నాగరాజు,వైస్ చైర్మన్‌గా మాదిగ లక్ష్మిలు ఎన్నిక కావడం జరిగిందన్నారు. నూతన విద్యాకమిటీ చైర్మన్,వైస్ చైర్మన్,కమిటీ సభ్యులుగా ఎన్నికైన వారిని పాఠశాల సిబ్బంది,గ్రామస్తులు సన్మానించారు. అలాగే పాలకుర్తి ఎంపిపిఎస్ పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌గా ఎం రవి,వైస్ చైర్మన్‌గా బి సరస్వతిలు ఎన్నికయ్యారు.

# మన మనుగుడకే ప్రకృతి వ్యవసాయమే ప్రాణాధారం...



**మిడుతూరు, ఆగస్టు17, ప్రభాతవార్త;** మన మనుగడకు ప్రకృతి వ్యవసాయమే ప్రాణాధారమని జిల్లా ఆర్‌పీసీ లక్ష్మయ్య అన్నారు. మండంలోని చౌటుకూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌పీసీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ప్రకృతికి అనుగుణంగా సాగు చేయడం వల్ల అన్ని పంటల ఆశించే పురుగులు తెగలపై ప్రభావం ఉంటుందన్నారు. ప్రకృతి సహజ సిద్ధంగా లభించే వనరులతో వేపగింజల కషాయం, వేపాకుతో సహస్త్రం,భూమికిభూసారం చేయడంలో ఘనామృతం, ద్రవ జీవామృతం తయారుచేసి గ్రామ రైతులకు, మహిళా రైతులకు చూపించడం జరిగింది. గ్రామంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని మాకు మరింత ప్రోత్సాహం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీపీఎం అబ్దుల్‌సలాం, దాసు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేరళలోని వరద భాదితులకు విరాళాలు సేకరణ

**తుగ్గలి,ఆగస్టు 17,ప్రభాతవార్త**

మండల కేంద్రమైన తుగ్గలిలో సిపిఎం పార్టీ ఆద్వర్యంలో కేరళలోని వరద భాదితుల కొరకు ఇంటింటికి తిరిగి విరాళాలు సేకరించడం జరిగిందని సిపిఎం మండల అధ్యక్షుడు శ్రీరాములు,సిపిఎం మండల కమిటీ సభ్యుడు కొండారెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేరళలోని వరద భాదితుల కొరకు ప్రతి ఇంటికి వెళ్లి విరాళాలు సేకరించామన్నారు. సేకరించిన విరాళాలు జిల్లా కమిటీకి పంపడం జరుగుతుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు రంగరాజు,రంగస్వామి,సిఐటియు నాయకులు నెట్టెకల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

**దేవనకొండ,ఆగస్టు 17,ప్రభాతవార్త**



మద్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శరత్ కుమార్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆద్వర్యంలో శనివారం తెర్నేకల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మద్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యాహ్న భోజన పథకాన్ని ఒక మంచి ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టారన్నారు. ,రాష్ట్రంలో విద్యార్థుల డ్రాప్‌ఔట్ సంఖ్యను తగ్గించాలని,పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో మద్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అయితే పాలకుల నిర్లక్ష్యం వల్ల మద్యాహ్న భోజన పథకం నీరుగారే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నట్లు మెనూ అమలు చేయాలంటే ఏజెన్సీలకి బిల్లులు పెండింగ్‌లో లేకుండ విడుదల చేయాలన్నారు. అలాగే రాజకీయ ఒత్తిళ్లు తగ్గించాలన్నారు. అప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యులు రంగన్న,మండల అధ్యక్ష,కార్యదర్శులు మధు,భాస్కర్,మండల నాయకులు ఉమేష్,అరవింద్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాజుల పరిపాలన చరిత్ర కోట.. అంకాలమ్మ..!

- : నల్లమలలోని ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులో దర్శనం
- : కొల్లాపూర్ మహారాణి సంస్థాన కోట
- : ఎంతో విశిష్టత పటిష్టమైన భద్రతతో నిర్మించిన కోట నిర్మాణాలు
- : నిషేదమైన ప్రాంతంలో ఈ కోట రహస్యలపై ప్రత్యేక కథనం
- : కృష్ణనదిలోనే 40కి.మీ ప్రయాణం కొనసాగించాలి
- : గుప్తనిధుల తవ్వకాలతో కోటలో చరిత్ర ఉన్న దేవుళ్ల విగ్రహాలు ధ్వంశం
- : ప్రతి మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలకు అనుమతి







**ఆత్మకూరు, ఆగస్టు17, ప్రభాతవార్త:** నల్లమల అటవీ ప్రాంతంలో కృష్ణనది పరివాహక ప్రాంతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాల జిల్లా ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని రెండు రాష్ట్రాల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో ప్రవహించే కృష్ణనది మధ్యలో ద్వీపసంకల్పంలా విస్తరించి రాజులు పరిపాలించిన 16వ శతాబ్దంలో నిర్వహించిన ఈ కోటలో ఉన్న రహస్యాలు, కోల్లాపుర్ మహారాణి సంస్థానం పలు విషయాలపై ప్రభాతవార్త పాఠకులకు ప్రత్యేక కథనం అందించనుంది. చీమలతిప్ప సమీపంలోని దుర్గం పరిసరా ప్రాంతాలలో 16వ శతాబ్దంలో రాజులు, మహారాణులు పరిపాలించిన కోట విశిష్టత నేటికి చెక్కు చెదరలేదు. భక్తులకు అంకాలమ్మ కోటలో ప్రతి మంగళవారం దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. ఈ కోట విశాలమైన కొండపై 600ల అడుగుల ఎత్తులో 21 ఎకరాల స్థలంలో ఈ కోటను నిర్మించారు. నల్లమల అటవీ ప్రాంతంలో కొందరు గుప్తనిధుల తవ్వకాల పేరుతో కోటలో ప్రవేశించి చరిత్రగా చెబుకునే విశిష్టమైన దేవుళ్ళ విగ్రహాలను ధ్వంశం చేసి రాణులు స్నానాలు ఆచరించిన కోనేటి బావులను నేటికి భక్తులకు కనిపిస్తునే ఉన్నాయి. ప్రస్తుతం ఈ కోటకు వెళ్లాలంటే అటవీశాఖ అనుమతులు తప్పని సరిగ్గా ఉండాల్సిందే. లేకపోతే కేసులు తప్పవు. ఈ కోటను చేరుకోవాలంటే తెలంగాణ ప్రాంతంలోని కొల్లాపూర్ నుంచి 8కి.మీ దూరంలో కొండల మధ్య ఉన్న నగరానికి చేరుకోని అక్కడి నుంచి కృష్ణనదిలో జలమార్గం ద్వారా ప్రయాణం కొనసాగిస్తే కొటను చేరుకోవచ్చు. ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలో పెద్దచెరువు ప్రాంతం వరకు వాహనాలతో వెళ్లే అవకాశం ఉంది. భక్తాదులు ఖాళీనడకన కోటను చేరుకోని అక్కడే అంకాలమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించుకుంటారు. ఎంతో చరిత్ర ఉన్న ఈ కోటలో వజ్రాలు, బంగారు అభరాణలు, నిధులు ఉన్నాయనే బ్రమతోని చరిత్రగా చెప్పే కోటను శిథిలావ్యవ్థలో చేర్చి కేవలం అమ్మవారి కోసం భక్తులు కట్టించిన నూతన గుడి మాత్రమే దర్శనం ఇస్తుంది. 20 ఎకరాల స్థలంలో గతంలో రాజు క్రింద పనిచేసిన భంట్రోతులు ఉండే నివాసాల దగ్గర ప్రతి ఇంటికి ఒకరోలు ఏర్పాటు చేయడం పురాతన కట్టడాలతో నిర్మించిన ఇళ్లు ఇప్పటికి అలాగే ఉన్నాయి.

**అంకాలమ్మ కోటలో కొలువు తీరిన దేవుళ్ల దర్శనం..** శ్రీశైలం శైవ క్షేత్రంలో వెలసిన మల్లికార్జున, బ్రహ్మారాంభికస్వామి ఆశీస్సుల కోసం దేశ వ్యాప్తంగా ఎంతో మంది దైవదర్శనానికి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లే వారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల కృష్ణనది పరివాహక గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు జలమార్గం ద్వారా ఈ అంకాలమ్మ కోటను సందర్శించి శ్రీశైలానికి బయలుదేరే వారని చరిత్ర చెబుతుంది. కోటలో శివలింగం, వినాయక విగ్రహం, అభయాంజనేయస్వామి వివిద రూపాలలో వెలసిన దేవుళ్ల పురాతనమైన విగ్రహాలను గుప్తనిధుల పేరుతో ఎక్కడా పడితే అక్కడా ధ్వంశం చేశారు. కేవలం భక్తులకు దర్శనం ఇచ్చే అంకాలమ్మ దేవి, రాజులు పరిపాలించిన కాలంలో ఏర్పాటు చేసిన శివలింగం మాత్రమే భక్తులకు దర్శనం ఇస్తున్నారు. కోటలో ఎన్నో రహస్యలు వింతలు ఉన్నప్పటికి ఈ కోట చరిత్ర, విశిష్టత తెలంగాణ రాష్ట్రంలోని కొల్లాపుర్‌లో పరిపాలన చేసిన రాజుల పరిపాలన ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమల అటవీ ప్రాంతంలోని చీమల తిప్ప, దుర్గం ప్రదేశాలలో ఈ కోట నిర్మాణం చేపట్టారు.

## ఏర్పాట్లను పరిశీలించిన సబ్‌కలెక్టర్



**మంత్రాలయం, ఆగస్టు 17, ప్రభాతవార్త:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో జరిగే శ్రీ రాఘవేంద్రస్వామి 353వ ఆరాధనోత్సవాల్లో భాగంగా కర్ణాటక సిఎం సిద్దరామయ్య ఈనెల 19వ తారీఖున అనగా సోమవారం మంత్రాలయంకు వస్తున్న కారణంగా సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ శనివారం ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసులు, రెవిన్యూ అధికారులు, పంచాయతీశాఖ, విద్యుత్‌శాఖ అధికారులు, అగ్నిమాపక శాఖ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హెలిప్యాడ్ మైదానాన్ని పరిశాలించారు. ఉత్సవాలకు ఎంతమంది భక్తులు వస్తున్నారో తెలుసుకుని తగిన ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. శాంతిభద్రతల విషయంలో పోలీసులు కఠినంగా ఉండాలన్నారు. వీరివెంట సిఐ పుల్లెం రామాంజులు, ఎస్ఐ గోపినాథ్, డిటి రాఘవేంద్ర, విద్యుత్‌శాఖ ఏఈ గోవిందు తదితరులు ఉన్నారు.

## జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం దారుణం




**ఆదోని, ఆగస్టు 17, ప్రభాతవార్త** కలకత్తాలో ఆర్‌జిఐ, కెఎఆర్ ఎంసిహెచ్‌లో విధులు నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్ మౌనిత దెబ్బ్నుత్కుపై అత్యాచారం, హత్య జరగడం దారుణమని డిఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యకుడు ధణాపురం ఉదయ్ అన్నారు. శనివారం డిఎస్ఎఫ్ ఆద్వర్యంలో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులతో రిలయన్స్ ట్రెండ్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్ మాట్లాడుతూ ఈ నెల 9న కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సాక్ష్యాలను పక్కదోవ పట్టించి క్రూరాతి క్రూరంగా గ్యాంగ్ రేప్ చేసిన నింధితులను కఠినంగా శిక్షించకుండ జైలులో అన్నం పెట్టి మేపడం చాలా భాదాకరమన్నారు. హత్య చేస్తున్నటువంటి నింధితులను కఠినంగా శిక్షించి ఉరితీయాలని డిఎస్ఎఫ్ విద్యార్థి సంఘంగా డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఎఫ్ నాయకులు హరికృష్ణ, నరసింహులు, వినీల్, నవీన్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

**ఎస్ఎఫ్ఐ ఆద్వర్యంలో :** ఆరురోజుల క్రితం జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటనలో నింధితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం ఐఎంఎ ఆద్వర్యంలో డాక్టర్లు, నర్సులు, విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రభుత్వ ఆసుపత్రి నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సూరి, గౌస్ పాల్గొన్నారు.

మెడికో విద్యార్థి అత్యాచార ఘటనపై దర్యాప్తు జరిపించాలి : కోల్‌కతా మెడికో విద్యార్థి అత్యాచార, హత్య ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని పిడిఎస్‌ఓ రాష్ట్ర నాయకులు తిరుమలేష్ అన్నారు. శనివారం పిడిఎస్‌ఓ, ఎన్‌వైఎస్ ఆద్వర్యంలో పట్టణంలోని విశ్వనారాయణ జూనియర్ కళాశాల నుండి మెయిన్ రోడ్డు వరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండ నింధితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైఎస్ పట్టణ కార్యదర్శి వీరేష్, మహేష్, సతీష్, పిడిఎస్‌ఓ డివిజన్ కార్యదర్శి శివ, మహిళా కన్వినర్ నిఖీత, మేఘన, కార్యకర్తలు ఆది, అశోక్, రాజు, కేశవ, రంగన్న తదితరులున్నారు.

## పంటల పొలాల పై పందుల దాడి



**కొలిమిగుండ్ల, ఆగస్టు17, ప్రభాతవార్త:** కొలిమిగుండ్ల మండల కేంద్రానికి సమీపంలో ఉన్న సాగర్‌రెడ్డి అనే రైతు పొలంలో సాగుచేసిన మొక్కజొన్న పంటను శనివారం తెల్లవారుజామున పందులు ధ్వంసం చేశాయని రైతు వాపోయాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పంట కంకి దశలో ఉండని పందులు పంట పై దాడిచేసి అర ఎకర పంటను ధ్వంసం చేశాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులు పందుల నివారణకు తక్షణమే చర్యలు తీసుకోని రైతుల పంట పొలాలను కాపాడాలని రైతు అధికారులను కోరారు.

## ప్రారంభించారు.. వదిలేశారు..!

- రూ. 40 లక్షలు నిధులు వృథా
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన గూళ్యం-1 సచివాలయం
- పట్టించుకోని అదికారులు

**హాలహర్వి, ఆగస్టు17, ప్రభాతవార్త;** గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందించాలన్న లక్ష్యంతో గత వైసీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసింది. సచివాలయ నిర్మాణం కోసం అప్పటి వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలు నిదులు మంజూరు చేసింది. ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు చేసి సచివాలయం భవనాలను నిర్మించినప్పటికీ సచివాలయాల్లో సిబ్బంది విధులు నిర్వహించకపోవడంతో సచివాలయాలు నిరుపయోగంగా మారాయి. వివరాల్లోకి వెళితే..... మండలంలోని గూళ్యం-1 సచివాలయం రూ.40 లక్షలతో నిర్మించారు. ఎన్నికల సమయంలో అప్పటి వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి విరుపాక్షి సచివాలయాన్ని ప్రారంభించారు. అయితే సచివాలయం ప్రారంభించారు కానీ అందులో సచివాలయ సిబ్బంది మాత్రం విధులు నిర్వహించడం లేదు. గూళ్యం-1 సచివాలయం ఊరికి దూరంగా జన నివాసం లేని చోట సచివాలయం నిర్మించారని, అందుకే ఆ సచివాలయంలో సచివాలయం ఉద్యోగులు విధులు నిర్వహించేందుకు విముఖత చూపుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ప్రస్తుతం గూళ్యం-1 సచివాలయ పాత గ్రామ పంచాయతీ భవనం ఇరుకు గదిలో ఉంది. ఇరుకు గదిలో సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహిస్తుండడంతో వివిధ పనుల కోసం సచివాలయంకు వచ్చిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రూ.40 లక్షలు ఖర్చు చేసి సచివాలయ ఉద్యోగుల కోసం సచివాలయ భవనం నిర్మిస్తే సచివాలయ ఉద్యోగులు మాత్రం కొత్త సచివాలయంలో ఎందుకు విధులు నిర్వహించడంలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యం వల్లే సచివాలయ భవనం నిరుపయోగంగా మారిందని ప్రజలు విమర్శిస్తున్నారు. పాత పంచాయతీ భవనంలో అయితే తాము ఇష్టానుసారంగా విధులకు రావొచ్చని, తమను అడిగేవారు ఉండరన్న ఉద్దేశ్యంతో కొత్త సచివాలయంకు వెళ్లకుండా ఊరికి దూరంగా ఉందన్న సాకుతో ప్రజలను, అధికారులను సచివాలయ ఉద్యోగులుమభ్య పెడుతున్నారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. కొత్త సచివాలయంలో ఉద్యోగులు విధులు నిర్వహించకుంటే సచివాలయం ఎందుకు నిర్మించారని రూ.40 లక్షలతో సచివాలయం ఎందుకు నిర్మించారని గ్రామస్తులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. కొత్తగా నిర్మించిన గూళ్యం-1 సచివాలయం ఊరికి దగ్గరలోనే ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే సచివాలయ ఉద్యోగులు సచివాలయం ఊరికి దూరంగా ఉందని



మాయమాటలు చెప్పి అధికారులను మభ్య పెడుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. కొత్తగా నిర్మించిన సచివాలయంలో ఉద్యోగులు విధులు నిర్వహించకపోవడంతో సచివాలయంలో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికే సంబంధిత అధీఆరులు స్పందించి సచివాలయ ఉద్యోగుల మాటలను నమ్మకుండా కొత్త సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో ఈ విషయంపై మీ కోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై ఇన్‌చార్జి ఎంపీడీఓ మల్లికార్జునను వివరణ కోరగా, గూళ్యం-1 కొత్త సచివాలయం నిరుపయోగంగా ఉన్న మాట వాస్తవమేనని చెప్పారు. ఈ విషయంపై విచారణ చేసి సచివాలయ ఉద్యోగులు కొత్త సచివాలయ భవనంలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## ప్రతిభకు పట్టము సిఐ హనుమంతునాయక్ అవార్డు



**నంద్యాల, అగస్టు 17, ప్రభాతవార్తప్రతినిధి** వివినిర్వహణలో నిక్చితంగా వ్యవహరించి అసాంఘిక కార్యకలాపాల నిరోదించడము ఉత్తమ సేవ కనబరచిన సిఐ హనుమంత నాయక్‌ను ఉత్తమ పోలీసు అఫీసరుగా అవార్డును మంత్రి బిసి అందించారు. 78వ సాతంత్ర దినోత్సవమునుపురస్కరించుకుని నంద్యాలలో జరిగిన స్వాతంత్ర వేడుకల్లో కోవెలకుంట్ల సిఐగా కొనసాగుతున్న హనుమంతునాయక్‌కు రోడ్డు భవనాల శాఖ మంత్రి బిసి జనార్దనరెడ్డి యస్‌పి అదిరాజ్‌సింగ్‌రాణా అద్వర్యంలో ఉత్తమ పోలీసు అఫీసరుగా అవార్డును అందించారు. గతంలో ఏకంగా మూడు సంవత్సరాలపాటు అళ్లగడ్డ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టరుగా విది నిర్వహణలో పక్షపాతము లేకుండా పార్టిలకు అతీతంగా పని చేసిన ందుకు సిఐకి అవార్డు అందించారు.

## ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి

ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

- ప్రశాంతంగా మండల సర్వసభ్య సమావేశం

**కౌతాళంరూరల్, ఆగస్టు17, ప్రభాతవార్త;** ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశించారు. ఈ మేరకు శనిఆరం కౌతాళంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎమ్మెల్యే అధ్యక్షతన చేపట్టారు. ఈ సమావేశంలో ఎంపీటీసీలు, సర్పంచులు, జెడ్పీటీసీ, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు. మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై సభా దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో తీవ్రంగా నీటి సమస్య ఉందని, నీటిని శుద్ధి చేయకుండా వదులుతున్నారని ప్రజాప్రతినిధులు సభా దృష్టికి తీసుకొచ్చారు. నీరు మొత్తం పసు రంగుగా మారి దుర్వాసన వస్తున్నాయన్నారు. అలాగే విద్యుత్ సమస్యలు కూడా ఉన్నాయన్నారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సమస్యలను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ ప్రహ్లాద ఆచారి, ఎంపీపీ అమ్రేష్, కో ఆప్షన్ మెంబర్ మాబుసాబ్, బుజ్జిస్వామి, జెడ్పీటీసీ, పాల్ దినకర్, సత్రికిక్కయ్య, గోపాల్‌రెడ్డి, గురునాథరెడ్డి, ఎంపిడీఓ, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.



## అసాంఘిక కార్యాకలాపాలు కొనసాగిస్తే ఎంతటి వారైన ఉపేక్షించం



**నొస్సం(కోవెలకుంట్ల)అగస్టు 17, ప్రభాతవార్త** సర్కిల్ పరిదిలో ప్రజలకు ఇబ్బందులు కలిగించే అసాంఘిక కార్యకలాపాలు కొనసాగిస్తే ఎంతటి వారైన ఉపేక్షించే ప్రసక్తి లేదని సిఐ హనుమంతు నాయక్ హెచ్చరించారు. శనివారము సర్కిల్ పరిదిలోని నొస్సం గ్రామానికి సిఐ హనుమంతు నాయక్ సందర్శించారు. ఈసందర్బముగా అయన అక్కడున్న ప్రజలతోమమైకమై వారికి అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఇక్కడ ఎవరికి ఎలాంటి సమస్య వచ్చిన ఒక్క పోన్ కాల్ చేస్తే చాలు 30నిమిసాల్లో నేను మీ ముందు ఉంటారని చెప్పారు. అలాగే ఇక్కడ అసాంఘిక కార్యకలా పల్లో ఒక్కటే జూదము విచ్చల విడిగా కొనసాగేదిన చెప్పారు. గతంలో ఎవరు ఏమి చేసుకున్నారు నాకు అనవసరము ఇప్పటి నుండి వాటిని దూరంగా ఉంటే సరి లేక పోతే లాఠీ పవర్ ఎలా ఉంటుందోచూస్తారని హెచ్చరించారు. వాటిని గతంలో ఒక ప్రముఖ వ్యక్తికి సంబందించిన ప్రాంతలోనే సాగించేవారని కూడా తనకు పూర్తి సమాచారము ఉందని ఇక నుండి అదే కొనసాగిస్తే ఏ వ్యక్తి లాఠీ అంటే ఏమి రుచి చూపిస్తామని హెచ్చరించారు. అలాగే మట్కా, నాటు సారాయి ఇతర అసాంఘిక కార్యక్రమాలు ఎక్కడే జరిగితే సమాచారము ఇవ్వాని ఇచ్చిన వ్యమక్తి పేరు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

## బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి 28 వేల క్యూసెక్కుల నీటి విడుదల



**పాములపాడు, ఆగష్టు 17, ప్రభాతవార్తః** బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి 28 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డి పాడు నుంచి శ్రీశైలం కుడిగట్టు ప్రధాన కాల్వ ద్వారా బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ వద్దకు 28 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. అక్కడి నుంచి తెలుగుగంగ కాల్వకు 10 వేల క్యూసెక్కులు, జిఎన్ఎస్ఎస్ కాల్వలకు 12 వేల క్యూసెక్కులు, కెసిసి ఎస్కేప్ చానల్ కాల్వకు 6 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలుగుగంగ ఏఈ దేవేంద్ర శనివారం తెలిపారు.

## విధుల పట్ల అలసత్వం కఠిన చర్యలు తప్పవు

- డిఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ



**బండిఆత్మకూరు, ఆగష్టు 17, ప్రభాతవార్తః** విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ అన్నారు. శనివారం నారాయణపురం ప్రభుత్వాసుపత్రికి అకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా రికార్డులు పరిశీలించారు. బిసిజి, ఎఎన్‌సి రికార్డులను ఇంప్రూచేయాలని డాక్టర్లకు అదేశించారు. ఆసుపత్రికి వచ్చే పెషెంట్లకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను అదేశించారు. ప్రజలకు అందుతున్న సేవలపై అరాతీశారు. అక్కడున్న వారితో వైద్యం సరిగా అందుతుంతా లేదా అని అడిగి తెలుసుకున్నారు. చిన్నపిల్లలకు, బాలింతలకు మెరుగైన సేవలు అందించాలని గర్భిణీస్త్రీలకు, పిల్లలకు వ్యూమ్యునైజేషన్ సక్రమంగా జరిగేవిధంగా చూడాలని సిబ్బందిని అదేశించారు. అన్‌లైన్‌లో వున్న ఆర్‌సిహెచ్ సమాచారాన్ని పరిశీలించి ఆశా వర్కర్లు రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. రోగులతో స్నేహపూర్వకంగా ఉండి వారికి కావాల్సిన సౌకర్యాలను కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో డా. కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి




**కర్నూలు విద్య, ఆగష్టు 17, ప్రభాతవార్తః** కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ, ఎఐడిడబ్ల్యుఎ సంఘాలు పేర్కొన్నాయి. నగరంలో ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో నిరసన చేస్తున్న జూనియర్ డాక్టర్లకు ఎస్ఎఫ్ఐ, ఐద్వా జిల్లా కమిటీ మద్దతు తెలిపారు. అనంతరం ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడుతూ ఆర్ జి కార్ మెడికల్ కళాశాలలో పీజీ వైద్యురాలుగా పనిచేస్తున్న మౌమిత ఆగష్టు 9న ఆసుపత్రిలో విశ్రాంతి తీసుకోవడానికి వెళ్లిన తనమీద మానవమృగాలు పాశవికంగా క్రూరంగా అత్యాచారం, హత్యచేసి విగతజీవిగా మార్చారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్ అత్యాచారం, హత్యను కప్పిపుచ్చి ఆత్మహత్యగా చిత్రికరించే ప్రయత్నం చేయగా పోస్టుమార్టం నివేదికలో నిజాలు బయటపడి ఒకరికన్నా ఎక్కువ మంది అత్యాచారం చేశారని పోస్టుమార్టం నివేదికలో వెల్లడయింది. అత్యాచారం చేసిన దుండగులను ఇంతవరకు అరెస్టు చేయకుండా వారిని పట్టుకోలేదంటే అక్కడున్న ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహారించడం సిగ్గుచేటన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలను రక్షిస్తామని, వాళ్ళకు అండగా ఉంటామని మాటల రూపంలో ఉత్తర ప్రగల్బాలు చేయడం తప్ప అచరణలో ఉత్త శూన్యం మాత్రమే ఉందని వారు ఎద్దేవా చేశారు. హత్యకు గురికాబడ్డ డాక్టర్ కుటుంబానికి అన్ని రకాలుగా రక్షణ కల్పించి అమ్మాయిపై అఘాయిత్యానికి పాల్పడిన దుండగులను కఠినాతి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ నగర అధ్యకార్యదర్శులు అమర్ సాయి ఉదయ్ నాయకులు అర్యన్ ఐద్వా నాయకులు శ్యామల వేనమ్మ తదితరులు పాల్గొన్నారు.